# పడి లేచే కడలి తరంగాలు

**అడుగడుగునా ఎదురయ్యే అనుభవాలు మనిషి తత్వాన్ని, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తుంటాయి. తద్వారా అభిప్రాయాలు కొత్త మెరుగులు దిద్దుకుంటాయి. ఈ అనివార్య పరిణామక్రమానికి ఓ అందమైన ఉదాహరణ**

ఆఫీసు నుంచి బయటపడి కారు పార్క్ చేసిన చోటుకు వచ్చాడు రామగాంధీ. ఎక్కడకు వెళ్ళాలి అనేది ప్రశ్న. అప్పుడే ఇంటికి వెళ్ళ బుద్ధి కాలేదు. ఉదయం అమ్మ చెప్పిన మాటలు ముందుకు వచ్చి కూర్చున్నాయి. "సాయంత్రం పెందరాళే ఇంటికి వచ్చెయ్యి."

ఎందుకు అని అడగకుండానే తరువాతి వాక్యం కూడా చెప్పింది అమ్మ. "ఇవాళ స్వామి నిరంజనానంద వస్తారు. మన ఇంట్లోనే పూజలు."

పూజ ఎందుకో కూడా చెప్పనవసరం లేదు రామగాంధీకి. కొడుకు మనసు మార్చడం కోసం ఎన్నో వ్రతాలు చేస్తోంది ఆమె. ఎలాగయినా ఈ సంవత్సరం కల్యాణం చేయాలి. ఇంటికి కోడలు రావాలి. తనకు విశ్రాంతి చిక్కడం కోసం కాదు. ఇంట్లో ఆడపిల్ల తిరుగాడుతూ ఉంటేగాని శోభ ఉండదు.

రామగాంధీ వివాహానికి సుముఖంగా లేడు. అయిదేళ్ళ నుంచీ ఈ తతంగం జరుగుతూనే ఉంది. అతని మనసు విప్పి చెప్పడం అతనికే చేతకావడం లేదు. స్పష్టంగా తెలియని ఆలోచనలకు, అంశాలకు అక్షరకల్పన, రూప నిర్మాణం చేయడం ఎంత కష్టమో, అంతా అనుభవిస్తున్నాడు అతను ఈ అయిదేళ్ళ నుంచీ.

"చక్కగా చెప్పిన మాట విను. నీకేం తక్కువని ఇప్పుడు వద్దంటూ తాత్సారం చేస్తావు? నీ ఇష్టం వచ్చిన పిల్లనే ఎన్నుకో. మాకేం అభ్యంతరం లేదు" అని అమ్మ ఇప్పటికి ఎన్ని వందల మార్లు ఏకరువు పెట్టిందో.

"ఏమిటి నా ఇష్టం?" ఇదే అతనికి అంతు చిక్కని విషయం.

"చదువు దిగ్విజయంగా ముగిసింది. మంచి ఉద్యోగం సంపాదించుకున్నాడు. అంతా వాడి ఇష్టం. ఇందులో నేను కల్పించుకుని చెప్పాల్సింది ఏమీ లేదు" అని తండ్రి ఈ విషయానికీ, తనకూ ఏమీ సంబంధం లేదన్నట్లుగా అనేశాడు. ఇదొక్కటే అని ఏమిటి? ఆయనకు ఏదీ సంబంధం లేదు. ఇంట్లోనే ఆయన 'నాన్ పేయింగ్ గెస్ట్.' ఆయనకు ఉన్నదల్లా ఒక్కటే వ్యాపకం: దేశం. ఈ దేశం, నా మాతృభూమి ఏమైపోతోంది? దీనికి నా ఋణం తీర్చుకోవడం ఎలా? ప్రజలను ఉత్తేజపరచి వాళ్ళలో స్వప్రజ్ఞ పెరిగేటట్లు చూడడం తప్ప ఇంకో పని పాటు ఆయనకు లేవు.

దేశ ప్రజల కోసం తన సర్వస్వమూ ధార పోశాడు. 'దేశభక్త' బిరుదు ఇస్తామంటే వద్దన్నాడు. "బిరుదులు, సన్మానాలు ఎందుకు? వాటి కోసమా నేను ఇన్నాళ్ళా జీవితం అంతా ధారపోసింది? నాకు చేతనయిన పని నేను చేసుకుంటూ పోతున్నాను. ఈ మార్గంలో అనేకమంది శ్రేయోభిలాషుల్ని, వ్యతిరేకుల్నీ తయారుచేసుకున్నాను. నాది అనుకున్న పని ఎన్ని ఆటంకాలు వచ్చినా మానకుండా, విడవకుండా చేసుకుంటూ పోతున్నాను. ఇంతకంటే మరో తృప్తి నాకేం కావాలి?" ఇదీ ఆయన ధోరణి.

రామగాంధీ పుట్టినప్పుడు ఆయన జైల్లో ఉన్నాడు. 'కొడుకు పుట్టాడు' అన్న శుభవార్త విన్నప్పుడు, 'దేశానికి మరో దీపకళిక వెలిగింది' అని మనసుకు చెప్పుకోవడం, మందహాసం చేయడం తప్ప ఆయన ఇంకేమీ అనలేదు.

ఇంటికి వచ్చిన తరువాత కూడా పిల్లవాడిని ఎక్కువసేపు ఆలించి పాలించడానికి ఆయనకు విరామం లేదు. "వాడికి ఏం పేరు పెడతావు బావా" అని పెద్ద బావమరిది అడిగినప్పుడు, "ఇంకేం పేరు? దేశంలో ఒక్కటే పేరు. ఇంటింటా అదే పేరు. గాంధీ. అంతకంటే మనం ఆ మహానుభావుడికి ఏం చేయగలం? ప్రతి ఇంట్లోనూ ఒక గాంధీ ఉన్నప్పుడే ఈ దేశం ఏమైనా బాగు పడేది. ఉన్నతికి వచ్చేదీను" అని హాయిగా నవ్వుతూ చెప్పాడు. అందరికీ ఈ పేరు ముఖ్యంగా భార్యకు, వాడిని తొమ్మిది మాసాలు మోసి కన్న మనిషికి ఇష్టమా లేదా అన్న సంగతి ఆయనకు పట్టలేదు.

"నాకు దేవుడంటే ఇష్టం. దేవుడి పేరే పెట్టుకుంటాను" అంది ఆమె.

"గాంధీగారే దేవుడు. మనుష్యరూపంలో ఉన్న దేవుడు. అంతకన్నా ఇంకేం కావాలి?"

కానీ, ఆమెకు మాత్రం ఇలలో భగవంతుడంటే రాముడు, రాముడొక్కడే. అందుకే అబ్బాయి పేరు 'రామగాంధీ'గా స్థిరం అయిపోయింది.

కారు బయటకు తీస్తున్నంత సేపూ ఈ వివరాలన్నీ మనసు పొరలలో కదలాడాయి రామగాంధీకి, విదిలించి వేయడానికి వీలులేకుండా.

పూజలతో, కీర్తనలతో కాలక్షేపంచేసే తల్లి ఒకపక్క, ఏమీ పట్టనట్లుగా దేశాన్ని పట్టుకు పాకులాడే తండ్రి మరోపక్క. రామగాంధీకి వీళ్ళిద్దరూ సమస్య కానే కాదు. ఈ ఇద్దరి మధ్య తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ ముందుకు పోవడమే అతని ధ్యేయం.

**తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ ముందుకు పోవడమే అతని ధ్యేయం. అతని మనసు నిండా ఎన్నో తీగలు, నరాలు. ప్రతిదీ ప్రాణంతో తొణికిసలాడుతూ పెల్లుబుకుతూ ముందుకు దూకేదే.**

అలాగే చదువు కొనసాగించాడు. టెక్నాలజీలో మునిగి తేలుతున్నాడు. అతని మనసు నిండా ఎన్నో తీగలు, నరాలు. ప్రతిదీ ప్రాణంతో తొణికిసలాడుతూ పెల్లుబుకుతూ ముందుకు దూకేదే.

తిన్నగా క్లబ్బుకు వెళ్ళాడు రామగాంధీ.

"ఓ. ఇవాళ చాలా వేగిరం వచ్చేశారే" అన్నాడు తెలిసిన ఆసామి. రామగాంధీ జవాబేమీ చెప్పకుండా బిజినెస్ టుడే పత్రిక అందుకుని పేజీలు తిప్పుతున్నాడు ఏదో వెదుకుతూ.

"క్లబ్బులో కూడా పుస్తక పఠనమేనా" అన్నాడు ఆ ఆసామి.

నవ్వి ఉరుకోవడం తప్ప ఇంకేం జవాబు లేదు.

"అవును. పుస్తకాలు జీవితంలో భాగం. అందుకే క్లబ్బుల్లోనూ అవే. ఆటపాటలు సరే, ముఖ్యంగా కాంటాక్ట్ల కోసం ఇక్కడికి వస్తాం మనం. అంతే కదూ" అన్నాడు ఆ ఆసామి. ఎలాగైనా రామగాంధీ చేత మాట్లాడించాలన్నది అతని ప్రయత్నం. ఇతనికీ మూగవ్రతం ఏమీ లేదు. అత్యవసరం అయితే తప్ప పెదవి దాటి పలుకు బయటకు రాకూడదన్నది అతని అభిమతం.

"మన ఇండస్ట్రీలకు మళ్ళీ మంచి రోజులు వస్తున్నాయి. డ్యూటీలు, సర్‌చార్జీలు చాలమటుకు తగ్గించి వేస్తోంది ప్రభుత్వం. ధరలన్నీ నేలవైపు చూడడానికి మరో అవకాశం. అయినా, మనిషిలో దురాశ తగ్గిపోలేదు కదూ? అందుకనే ఆకాశంలో నక్షత్రాలతో పోట్లాడుతున్నాయి ధరలు. తయారీ దారు, వాడకందారుల మధ్య రకరకాల పెత్తందార్లు లేకపోతే ఎంత బాగుంటుంది?"

రామగాంధీ పుస్తకం పక్కకు పెట్టాడు. అతను చూడాలనుకున్న పేజీ చదవడం అయిపోయింది. ఇకనైనా అవతలి మనిషితో మాట్లాడకపోతే బొత్తిగా అన్యాయంగా ఉంటుంది. మరీ అనాగరికం అనిపించవచ్చును తన ప్రవర్తన.

"పరిశ్రమలలోనే అని ఏముంది లెండి. జన జీవితంలో కూడా ఈ మధ్యవర్తిత్వం రకరకాల పల్లవులు తొడుగుతోంది. మనకు నాయకులు ఎక్కువైపోతున్నారు. అనుయాయులు లేని నాయక పార్టీలు పడుతూ లేస్తూ జనజీవితాన్ని ఎలాగైనా తమ అధికారం కిందకు తెచ్చుకోవాలని చూస్తున్నాయి" అన్నాడు రామగాంధీ.

"సంకీర్ణ ప్రభుత్వాలు వచ్చేశాయి కదూ ప్రతిచోటా. ఏక పార్టీ కాదు, అన్ని పార్టీలు కలసి పరిపాలన చేయడమే భవిష్యత్తులో మనదేశం నుదుట రాసిపెట్టి ఉన్నదని ఇవాళ దాదాపు అందరూ అంగీకరిస్తున్నారు."

"శతదినోత్సవాలు సినిమాలకే పరిమితం కాలేదు, పార్టీల పాలకులూ వీటికి తలలు ఎత్తుకు తిరుగుతున్నారుగా ఇప్పుడు" అన్నాడు రామగాంధీ.

"స్థిరమైన ప్రభుత్వం ఇద్దాం దేశానికి ఈ వంద రోజులూ అంటున్నారు వాళ్ళు ఈ స్థిరత్వం కొనసాగితే బాగుండును."

"అస్థిర పరిస్థితిని స్థిరంగా కొనసాగించడమేగా వాళ్ళు సాధించగలిగింది." బయటపడడం ఇష్టం లేకపోయినా పైకి అనేశాడు రామగాంధీ. ఇంతలో మరెవరో వచ్చి వాళ్ళతో చేరారు.

"రాజకీయాలు చర్చిస్తున్నారా? క్లబ్ సెక్రటరీకి ఇష్టం ఉండదు" అన్నాడు ఆ కొత్తగా వచ్చిన మనిషి.

"మేం చర్చించడం లేదు. కేవలం మాట్లాడు కుంటున్నాం."

రామగాంధీకి ఎక్కడో పూర్వం ఓ నాటకంలో చదివిన వాక్యం గుర్తుకు వచ్చింది. 'మా నాయకులు చర్చిస్తారు తప్ప, ఆలోచించరు' అని. అతని పెదవుల మీద లీలగా చిరునవ్వు మెదిలింది.

"ఏమిటి మీలో మీరే నవ్వుకుంటున్నారు?"

"చెప్పమంటారా?"

"చెప్పగూడని విషయం అయితే వద్దు లెండి" అన్నాడు అతను, కేవలం ఎదుటి మనిషిని

కవ్వించడం కోసమే.

"రహస్యం కాదు గానీ, అందరికీ ఇష్టం ఉండదు ఈ ఆలోచన" అని మొదలుపెట్టాడు.

"మనకు కాలక్షేపానికి పనికివస్తే అంతే చాలు. ఓ గంట సేపు ఫ్రీగా మనసును గాలిలో తేలి ఆడేటట్లు చేసుకొనడానికే కదూ మనం ఇక్కడకు వచ్చేది" అన్నాడు మూడో మనిషి.

"ఆచరణకు రాని ఆలోచన ఎప్పుడూ గాలిలోనే తేలి ఆడుతూ ఉంటుంది, పతంగిలాగ."

"దారం తెగిపోయేంతవరకు ఆడుతుంది. అంతే."

"తెగిందాక లాగకుండా ఉంటే సరి."

"ఆ చాకచక్యం తెలిస్తే జీవితాలు భేషుగ్గా ఉంటాయి" అన్నాడు రామగాంధీ.

"ఇంతకూ వాళ్ళు రాముడికి గుడి కట్టించడం తప్పుదంటారా?"

"రాజస్థాన్‌లో తయారవుతోందని పత్రికల వార్తలు..."

"ఇంజనీరింగ్ ఇండస్ట్రీలు బాగా పుంజుకున్నాయి గనుక ఇళ్ళు, గుళ్ళు, గోపురాలూ ఎక్కడేనా తయారు చేయవచ్చు. ఎక్కడికైనా దిగుమతి చేయవచ్చు. ఇది గొప్ప అభివృద్ధి సూచకమైన 'ఫీట్' కదూ."

"పాతకాలపు దేవాలయాలు స్వర్గంలో నిర్మాణం అయి, గరుడిడి కైంకర్యం వల్ల భూమిమీద ప్రతిష్ఠ అయినాయి. శ్రీరంగాన్ని గురించి ఇలాంటి కథే చెబుతారు. వినలేదూ?"

"ఎంతయినా మన పురాణాలు కొట్టిపారవేయవలసినవి కావు అనిపిస్తుంది, ఇలాంటి కబుర్లు విన్నప్పుడు."

రామగాంధీకి నాగార్జున సాగర్ డామ్ శంఖుస్థాపన సమయంలో నెహ్రూగారు చెప్పారన్నమాట మదిలో మెదిలింది: 'ఆధునిక దేవాలయాలు ఇవి.'

వాళ్ళ సంభాషణ ఇంకా లోతుగా కొనసాగుతోంది. డాలర్ రేటు పెరిగిపోవడం, రూపాయి విలువ పడిపోవడం, నలభై దగ్గర నిలిచిపోతుందనుకున్నది ఇంకా కిందకు జారడం... ఇలా ఎన్నో విషయాలు వాళ్ళ మాటలలో అలవోకగా దొర్లుకుపోతున్నాయి.

రామగాంధీ క్యాంటీన్ వైపు కదిలాడు.

అక్కడ మరో నామమాత్రపు పరిచయస్థుడు దొరికాడు.

"రండి రండి. కులాసానా? నాన్నగారు ఆరోగ్యంగా ఉన్నారా" అని ప్రశ్నలు వేశాడు ఆయన. చిరునవ్వే రామగాంధీ జవాబు.

రెండు కట్‌లెట్లు తిని, హార్లిక్స్ తాగిన తర్వాత ఇంక ఏం చేయాలో స్ఫురించలేదు రామగాంధీకి.

జీవితంలో స్పృహాకంటే నిస్పృహ ఎక్కువైపోయిన రైతుల మరణాన్ని గురించి మరోపక్క కొందరు మాట్లాడుకుంటున్నారు.

"ఆత్మహత్య మహాపాతకం."

"అయినా అంతకంటే మరో మార్గం దొరకలేదు వాళ్ళకు. ఎన్నాళ్ళని బడుగు జీవులు అప్పులతో బరువెక్కిన బతుకులు గడుపుతారు?"

"అందరూ సహాయం చేస్తామంటారు. ఆ సహాయం అందవలసినవాళ్ళకు ఆకాశంలాగానే తయారవుతుంది."

"ఆకాశం- గగనం- శూన్యం అన్నాడు."


"ఆకాశాత్ పతితం తోయమ్... ఏ దేవుడికైనా నమస్కారం చెయ్యి. అన్నీ సముద్రంలోకే వెళ్ళిపోతాయి."

"మళ్ళీ ఏ సముద్రం? పసిఫిక్ లేక ఇండియన్?"

"అసలు ఈ ప్రపంచాన్ని భూగోళం అంటున్నాం గాని, ఇది నిజానికి జలగోళం కదూ? మూడువంతులు నీళ్ళు, ఒకవంతు భూమి. అట్లాస్ చూసినా అంతే, గ్లోబ్ పరికించినా అంతే!"

"నీళ్ళు కూడా భూమిమీదనే నిలదొక్కుకుంటున్నాయి. సముద్రం అడుగునా భూమే ఉంది."

"కిందికి పోయినకొద్దీ నాగలోకం, నాకలోకం,



చిత్రాలు: నర్సిం

అలోకం..."

"అంతేనంటారా?"

రామగాంధీకి 'అంతేకాదు' అనిపించింది. అయినా, ఆ మాట పైకి అంటే మరింత చర్చ, కాదన్నదాన్ని తాను విపులీకరించి, వివరించి నిరూపణ చేయవలసివస్తుంది. మౌనం బహుమంచి పరికరం. పక్కకు తప్పుకోవడం పసందైన పని.

క్లబ్బు నుంచి బయటపడి మళ్ళీ కారులో కూర్చున్నాడు.

కారు తిన్నగా ఇంటికి తీసుకుపోలేదు.

దారిలో 'వస్త్రాలయం' దగ్గర నిలిచింది. ఇదీ ఒకరకంగా ఆలయమే.

నాన్నగారికి నాలుగు ఖద్దరు లాల్చీలు, ధోవతులు తీసుకున్నాడు. ఆయన ఉత్తరీయాలు వాడరు. అదో పటాటోపం కింద లెక్క.

అమ్మగారికి రెండు మంచి చీరలు తీసుకున్నాడు. వాటిలోనే జాకెట్ పీస్‌లు కూడా ఉన్నాయట.

స్వామివారికి కానుకగా ఏమయినా తీసుకుంటే మంచిదా? 'సర్‌ప్రయిజింగ్'గా ఉంటుంది. తల్లితండ్రుల అభిప్రాయాలకు పూర్తిగా ఉదాసీనంగా ఉండడం కూడా అతని ఉద్దేశం కాదు. కాకపోతే వాటితో తలమునకలు అవకుండా ఉండడమే అతను తీసుకుంటున్న కొద్దిపాటి జాగ్రత్త.

షోకేస్‌లు చూస్తే ఆకర్షణీయమైన వస్తువులు అగుపిస్తాయేమోనని ప్రయత్నించాడు. అందమైన విగ్రహాలు అనేకం కనిపించాయి. కానీ, స్వాముల వారికి విగ్రహాలు కానుకగా పనికివస్తాయా?

తులసి పేరుల మాలలు అనేకం ఉన్నాయి. రకరకాల సైజులు, రంగులు. వీటిని ఇవ్వగలిగితే యుక్తంగా ఉంటుందనిపించి మూడు పేరులు తీసుకున్నాడు.

రామగాంధీ ఇంటికి చేరుకునేసరికి స్వామివారు సుఖాసీనులై ఉన్నారు. పూజలు అయిపోయినట్లున్నాయి. సరైన సమయానికే చేరుకున్నాను అనుకున్నాడు మనసులో. అతను ఇప్పటికైనా వచ్చినందుకు తల్లికంటే ఆయనే ఎక్కువ ఆనందించినట్లుగా అనిపించింది ఆ ముఖ విలాసం చూస్తుంటే.

"వారు కూడా ఈ క్షణమో, మరుక్షణమో వచ్చేస్తారు. కాస్త నిదానంగా చూడండి" అంది అమ్మ.

ఎవరూ చెప్పకుండానే రామగాంధీ స్వామివారికి సాష్టాంగ దండప్రణామం చేశాడు. ఆయన చిదానంద ముద్రతో ఆశీర్వదించారు.

రామగాంధీ తులసి పేరుల దండలు వారి పక్కన ఉన్న వెండి పళ్ళెంలో ఉంచాడు. స్వామి వాటిని చేతుల్లోకి తీసుకొని, కొంతసేపు స్పర్శించి మౌనంగా ఉండిపోయారు.

కళ్ళు తెరిచిన తరువాత రామగాంధీ వైపు సూటిగా చూస్తూ "చాలా సంతోషం" అన్నారు. ఒక దండ తీసి మళ్ళీ చేతులతో పొడుగ్గా స్పర్శించి "దీనిని నీ దగ్గరే ఉంచు. ఆరోగ్యానికి మంచిది" అన్నారు.

రామగాంధీ వినయంగా స్వీకరించాడు.

రెండో దండ అమ్మగారిని పిలిచి ఇస్తూ, "మీ పూజలో పెట్టుకోండి. రోజూ స్పర్శించి నమస్కారం చేసుకోండి. కోరికలన్నీ నెరవేరుతాయి" అన్నారు.

"మహా ప్రసాదం" అంది అమ్మ.

ఆమె దండను కళ్ళకు అద్దుకుంటూ ఉండగానే, తండ్రి కూడా లోపలకు వస్తుండడం రామగాంధీ గమనించాడు.

స్వామివారు "రండి రండి. మీకోసమే చూస్తున్నాను" అని ఆయనకు స్వాగత వచనాలు పలికారు.

తండ్రి నమస్కారం చేసి కూర్చుంటూ, "ఎంతో పెందరాళే రావాలని విశ్వప్రయత్నం చేశాను. కుదిరింది కాదు. మరేం అనుకోకండి" అన్నాడు.

"అనుకోవడానికి ఏముంది గనుక? దేశసేవా ధురంధరులు మీరు. ఎక్కడ ఉన్నా మీ దృష్టి అంతా మా మీద ఉన్నట్లే లెక్క. ఇందులో నాకేం సందేహం లేదు. మీ కార్యక్రమాలన్నీ చురుకుగా జరుగుతున్నాయా" అని కుశలప్రశ్నలు వేశారు.

**అప్పుడు ఆమె ముఖం ఎట్లా నిండుతనంతో తొణికిసలాడుతూ ఉండి ఉంటుందో రామగాంధీ ఊహించుకున్నాడు. రేపు ఆదివారం అమ్మ ఆనందం ఎంతగా ఇనుమడించిపోతుందో తలుచుకుంటే రామగాంధీకి ఇప్పుడే హృదయం విప్పారిపోయింది.**

మూడో దండను మళ్ళీ చేతుల్లోనికి తీసుకుని ఆశీర్వదిస్తూ ఆయనకు అందించారు. "ఇది ఎప్పుడూ మీ దగ్గరే ఉండాలి. శుభం కలుగుతుంది."

రామగాంధీకి ఆశ్చర్యం అనిపించింది. స్వామివారి కోసం అని మూడు దండలు తీసుకువస్తే అవి మళ్ళీ తమ కుటుంబ సభ్యులకే తిరిగి వచ్చాయి. నాలుగో దండ కూడా తెస్తే ఏమయ్యేదో! ఇలా జరుగుతుందని తాను అనుకోలేదు గనుక ఈ ప్రశ్నకు ఆస్కారం లేదని క్షణంలోనే స్ఫురించింది.

అందరూ తీరుబాటుగా, బాదరబందీ లేకుండా కూర్చున్నాక స్వామివారు చెప్పారు:

"దేశంలో ఉన్నదంతా దైవీసంపద. మనం గమనించినా గమనించకపోయినా ఇదే నిశ్చితార్థం. ఎవరి హృదయానికి వాళ్ళకు ఈ సత్యం తెలుసు. దీన్ని పునశ్చరణ చేసుకుంటూ ఉండడమే మనమందరమూ చేయవలసిన పని.

మన దేశంలో ఆధ్యాత్మికత తగ్గిపోతోంది అనుకుంటాం. తగ్గడం, హెచ్చడం కాల చక్రంలో పరిణామాలు. అప్రమేయమైన దానిని కొలవడానికి ప్రయత్నిస్తుంది మనిషి మేధ. అలా కొలతలకు అందదని ఎన్నిమార్లు ఎన్ని రకాలుగా మనకు రుజువు అవుతున్నాగానీ." తల్లి, తండ్రి తలలు ఊపుతున్నారు.

రామగాంధీకి ఎన్నో సందేహాలు.

వాటిని అడగడానికి రూపకల్పన, అక్షర నిర్మాణం తోడు కాదు. కళ్ళు అప్పగించి చూస్తూ ఉండిపోయాడు. కొంతసేపు అయినమీదట ధైర్యం చిక్కబట్టుకుని నిదానంగా అన్నాడు:

"దేశాభ్యుదయం కోసం మనిషి ఏం చేయాలంటారు? దేనిమీద గమనం ఉంచి పని చేయాలి? ఎంత పనిచేసినా మనసుకు పూర్తిగా తృప్తి దొరకడం లేదు. ఎందుచేతనంటారు?"

స్వామివారు మళ్ళీ ముగ్గురివైపూ చిరునవ్వుతో చూశారు. "ఏ మనిషి ఏం చేయాలి అనేది వేరే ఎవరో నిర్ణయించి చెప్పలేరు. ఎవరికి వారు నిర్ణయాలు తీసుకోవాలి. శుభకరం, శ్రేయస్కరం, బహు జనావళికి క్షేమకరం అయిన పనుల్లో సర్వమూ మరచి పని చేసుకుంటూ వెళ్ళాలి. అంతే. ఆలోచన పరిశుద్ధంగా, స్వార్థ రహితంగా ఉండే జాగ్రత్త మటుకు చాలా అవసరం. ప్రతిఫలం కోసం ఎదురుచూస్తూ కూర్చోవడం అనవసర కాలయాపన. మనసుకూ పెద్ద బెడద. ఆలోచన చేస్తున్నప్పుడే పూర్వాపరాలన్నీ చర్చించుకోవాలి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక మరి జాగు ఉండకూడదు. అంతే. అంతా దైవకార్యం, దైవప్రేరణ. మనం నిమిత్తమాత్రులం. మనద్వారా జరిగే ఏ కార్యకలాపమూ కలుషితం కాకూడదు. అంతే" అని స్వామివారు మళ్ళీ ధ్యానముద్రలోకి వెళ్ళారు. రామగాంధీ తల్లితండ్రుల ముఖాలలోకి చూశాడు. కొత్త తేజస్సు అంతటా ఆవరించుకుంది. సముద్రం లాంటి శాంతి అందరినీ కప్పివేసినట్లు అనిపించింది.

స్వామివారు తిరిగి వెళ్ళడానికి ఆసన్నులవుతున్నారు.

"మీ రాకవల్ల మా ఇల్లు పావనం అయింది" అంది అమ్మ.

"మీ ఇల్లు ఎప్పుడూ పావనాలయమే. ఈ పవిత్ర వాతావరణం నాతో కొంత తీసుకువెడుతున్నాను" అన్నారు ఆయన. "నేను తీసుకుపోతున్నాను గనుక మీకేం తక్కువ కాదు. భగవత్ శక్తి అపారం. అది అనుక్షణమూ వర్ధిస్తూనే ఉంటుంది" అని భరోసా ఇచ్చారు.

స్వామివారు వెళ్ళిపోయాక వాళ్ళు ముగ్గురూ భోజనాలకు కూర్చున్నారు. సగ్గుబియ్యం పరమాన్నం గ్లాసు చేతికి అందుకుని గటగట తాగుతూ, "అంతా నీవు అనుకున్నట్లే జరిగిందా. నీకు తృప్తిగా ఉంది గదా" అన్నాడు తండ్రి, రామగాంధీని ఒక కంట కనిపెడుతూనే.

అమ్మ ముఖం ఆనందంగానే ఉంది. ఏం చెబుతుందో గమనించాలని రామగాంధీకి ఉత్సాహం.

"యాభై సంవత్సరాల దాంపత్య జీవనం పూర్తయింది ఈ నాటితో. మీకు డెబ్బయ్ ఏళ్ళు వచ్చాయి. నాకూ అయిదారేళ్ళలో అంత వయసూ వచ్చేస్తుంది. అబ్బాయి నలభైకి దగ్గరవుతున్నాడు. వాడు ఇక ఒక ఇంటివాడు కావాలి. ఇదే లోపం అనుకున్నాను ఇన్నాళ్ళూ. కానీ, స్వామివారు చెప్పింది విన్నాక నా మనసు మారిపోయింది. ఇంకెవరైనా అయితే ఈ వేడుకలన్నీ చాలా పటాటోపంగా, ఆడంబరంగా జరుపుకుంటారు. మీకు అవేవీ ఇష్టం కాదు గనుక ఏదో ఇట్లా క్లుప్తంగా ఇంట్లోనే జరుపుకున్నాం" అన్నది ఆమె దాదాపు స్వగతంగా, సమాలోచన చేస్తున్నట్లుగా. "స్వామి నిరంజనానంద నాకూ నచ్చారు. నిరతిశయుడు. ఆ కోవలో ఇలాంటి వాళ్ళను బహు అరుదుగా చూస్తాం. అదలా ఉంచు. ఇవాళ నేనో ఉపన్యాసం విన్నాను. దాన్లో ఓ కొత్త సంగతి. ఆయన ఇది అనేక సంవత్సరాలుగా చెబుతూనే ఉన్నాడట. కానీ, నేను వినడం ఇవాళే మొదలు" అన్నాడు తండ్రి.

"ఏమిటది? మీకు తెలియని సంగతులు ఉన్నాయా" అనడిగాడు రామగాంధీ దాదాపు ఉత్సుకతతో ఊగిపోతూ. "ఎవరో తమిళనాడు నుంచి వచ్చారు. గాంధీగారి అనుయాయుడట. చివరి ప్రార్థన సమావేశంలో ఆయన చాలా దగ్గరగా ఉండి పాల్గొన్నాడట. అందుకనే ఆయన చెప్పిన విషయం నన్ను విచికిత్సలో పడేస్తోంది."

"ఏమిటది? చెప్పండి" అంది అమ్మ ఈ మారు వేగిరపరుస్తూ.

"గాంధీగారి ఆఖరు క్షణాలను గురించి నీవేం విన్నావు చెప్పు?"

తల్లి ఆశ్చర్యంగా చూస్తూ అతి నిదానంగా అంది: "గాంధీగారు ప్రార్థన సమావేశంలో పాల్గొనడానికి వస్తున్నారు. ఎవరో జన సమూహంలో నుంచి పిస్తోలు పేల్చి ఆయన్ను కాల్చారు. ఆయన 'హే రామ్...' అని మూడు మార్లు అంటూ నేల కూలిపోయారు. జీవితాంతం రామభక్తుడు గదా గాంధీగారు."

"ఆ మాటనే అందరమూ విన్నాం. నిజమేననుకున్నాం. కానీ, కాదట! ఈ వేళ ఉపన్యాసంలో తేలిన సంగతి అదే."

"ఏమిటది?"

"పిస్తోలు గుండు గుండెను తాకడం తోటే గాంధీగారు నేలకూలిపోయారు. ఆయన 'హే రామ్' అని ముమ్మారు కాదు కదా, ఒకసారి కూడా అనడానికి విరామం లేదు. నేల కూలడం, ప్రాణాలు పోవడం రెండూ ఏకకాలంలోనే జరిగాయి. హే రామ్ అన్నారని క్షణాలమీద ఆ సమావేశంలో మొదటి వరుసలో ఉన్నవాళ్ళే కల్పించేశారు. అదే మాట బహుళ ప్రచారం అయిపోయింది. అది నిజం కాదని ఈ రోజు చెప్పిన ఆయన ప్రత్యక్షసాక్షినని కూడా అన్నాడు." తండ్రిగారు అతివేగంగా చెప్పిన మాటలు విన్న రామగాంధీకి ఈ కొత్త విషయం ఆయనను ఎంతగా అతలాకుతలం చేసిందో అర్థమైంది. దాదాపు యాభై సంవత్సరాలుగా 'నిజం' అని నమ్ముతున్న విషయం, 'అది నిజం కాదు' అని నిర్ద్వంద్వంగా ఎరుక అయినప్పుడు మనసు ఏమైపోతుందో, దిక్కుతోచకుండా ఎలా ఏరూపం పొందుతుందో! అందులోనూ అది తనకు పూజనీయులూ, ఆరాధ్యులు అయిన వారి విషయంలో అయినప్పుడు వేరే చెప్పాలా?

"తుపాకీ గుండు తగిలిన తర్వాత రామస్మరణ చేసుకొనే సమయ విరామం ఉండి ఉండదు నిజమే. అయినా, మనసులో అదే స్మరణ ఉండవచ్చును కదా. ఆ మానసిక స్మరణ సూక్ష్మాతిసూక్ష్మంగా గ్రహించగలిగిన వాళ్ళు ఈ విషయాన్ని ఆయనే పైకి



